# సరికొత్త పాత కథ

"ఏంరా పిల్ల నచ్చిందా?"

"........."

"అలా ఊరుకుంటే ఎలాగరా? చెప్పు నచ్చిందో లేదో."

"నన్నడుగుతా వేమిటమ్మా !"

"నిన్నడగకపోతే మరెవరినిరా అడిగేది ? నేను పుస్తె కడతాననుకున్నావా!"

"చెప్పరా విసిగించక-పరాయిదా ఏమైనానా. మీ అక్కయ్య కూతురేకదూ-చెప్పు !"

"నీ ఇష్టం అమ్మా !''

"బావుందిరా బావుంది ! పెళ్ళాడేది నువ్వా నేనా ? నా ఇష్టం ఏమిట్రా.''

"సరే...'' అని అన్నాడు మూర్తి తన చిన్న మీసం కదిలిందా లేదా అన్నట్టు-

"అమ్మ నాయనా తాతలు దిగొచ్చార్రా బాబూ.''

* * * *

"నీక్కావలసిందేదో అడిగి చేయించుకోరా నాయనా. సిగ్గుపడకు వీలు కానప్పుడు ఎలా అవుతుంది మరి. దానికి ఊరంత సిగ్గు. అడిగితేనే గాని ఏం కావాలో ఏం తెలుస్తుంది"

మూర్తి అన్నానికి కూర్చున్నాడు, సీత మొదటే అన్నం, పప్పుయధా రీతిగా వడ్డించి చెయ్యి మీదికి నెయ్యి అడగనక్కరలేకండానేవేసి సిగ్గుతో అక్కడినుండి వెళ్ళిపోయింది. మూర్తి పప్పు అన్నం తినేసేడు, కూర కావాలి. ఎలాగ? అడగడానికి సిగ్గు! అదే పెళ్ళి అయిన తర్వాత మొదట సారి పెళ్ళాం చేతి అన్నం తినడం! కనుచూపు మేరలో ఎక్కడా సీత లేదు చేతి సంజ్ఞ చేద్దామంటే, గ్లాసు రెండుసార్లు చప్పుడు చేశాడు. కాని సీత రాలేదు. కంచం కూడా చప్పుడు చేసేడు. సీత మెల్లగా వచ్చి తలుపు వార నిలబడింది. మూర్తి కూర వైపు కళ్ళు తిప్పేడు. సీత వడ్డించింది. నూనె కోసం చెయ్యి చాపి ఉంచేడు. గ్రహించి నూనె వేసింది. రెండు గరిటెలూ అవగానే చెయ్యి తీసేశాడు. సీత వెళ్ళి పోయింది.

మూర్తికి మజ్జిగ కావాలి. సీత మాటిమాటికి వెళ్ళిపోవడం తనకి ప్రాణసంకటం అయింది. విసుక్కున్నాడు. ఏం చేస్తాడు? చిన్న దగ్గు దగ్గేడు. సీత రాలేదు! 'అమ్మా! మజ్జిగ కావాలే' అని అరిచాడు. సీత గబగబావచ్చి మజ్జిగ వేసి వెళ్ళిపోయింది. ఇదంతా చూస్తూన్న లక్ష్మి నవ్వుకొంది.

"అయ్యో సింగారమా! ఇలాగయితే ఎలా కాపురం చేస్తారర్రా! బయట కూర్చున్న నేనట్రా నీకు మజ్జిగ వేసేది! పెళ్ళాన్ని పిలవలేవూ. అవునే సీతా! ఎవరో ఒకరు చొరవ చేసుకుని మాటాడాలిగాని మూగ ముస్పాళ్లలా అలా చూస్తూ కూర్చుంటే ఎలా నడుసాయి. ఇంకా రెండు రోజులు. కావుండే! ఇప్పట్నుంచే మొగుడికి ఇలా చేస్తూంటే ఆ తర్వాత తిన్నగా అన్నం పెడతావా? అని!"

సీత ఈ మాటలు విని సిగ్గుతో చిన్న నవ్వు నవ్వుకొని తల వంచేసుకుంది. మొహం ఎర్రగా అయిపోయింది. వెంటనే గదిలోకి వెళ్ళిపోయింది. మూర్తి గబగబా అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు.

* * * *

"అప్పుడే రెండు అయిపోయింది. స్కూలుకి పోవాలి" అంటూ కుర్చీమీదనుంచి లేచాడు సీత కేసి చూస్తూ. అల్లుకుంటున్న సీత చలించ లేదు. పోనీ అమ్మతో చెబుదామా అంటే ఎక్కడికో వెళ్ళిపోయింది. సీత చూస్తూండగానే పుస్తకాలు సర్దుకొని బట్టలు మార్చుకున్నాడు. కాని ఇంకా సీత లేవలేదు. సైకిల్ తీసి మళ్ళా స్టాండ్ వేసేడు. అయినా ఏం జవాబు లేదు. 'ఇంకా అరగంట టైముంది' అన్నాడు చేతితో గడ్డం నిమురు కుంటూ. సీత పట్టించుకోలేదు. 'కాఫీ క్లబ్బుల్లో తాగొచ్చు కాఫీ' అని అన్నాడు. కాని జేబులో దమ్మిడీలేదు. ఇంక లాభం లేదు అనుకొని, 'కాఫీ పెట్టు' అన్నాడు సీత మూర్తి మొహం ఒక్కసారి చూసి నిప్పు చెయ్యడానికి వెళ్ళింది. మూర్తి కుర్చీలో కూర్చున్నాడు సీతవేపు చూస్తూ.

సీత కాఫీ తెచ్చి టేబుల్‌మీద పెట్టింది. ఒకటే గ్లాసు. మరోటి తేలేదు. కాఫీ వేడిగావుంది. సీత చూసేటట్టుగా రుమాలుతో గ్లాసు పట్టు కున్నాడు. సీత కదలలేదు ఆమె వినేటట్టు ఉఫ్; ఉఫ్, అని గట్టిగా ఊదేడు. అయినా యింకా రెండో గ్లాసు రాలేదు. ఇంకా ఇలా మౌనంతో కూర్చుంటే కాలేజీకి వేళ అయిపోతుందని తనే తెగించి "మరో గ్లాసు కావాలి" అని అడిగేడు. సీత తెచ్చి ఇచ్చింది. మూర్తి కాలేజీకి వెళ్ళి పోయాడు.

* * * *

"సీతా..."

"......"

"సీతా!"

"ఏమండీ!" అని సిగ్గుతో నిలుచుంది.

"అంత సిగ్గెందుకు? నాతో మాట్లాడవూ?

"......—"

"సీతా!"

"మీకు మాత్రం సిగ్గులేదా ఏమిటి?"

"అది అమ్మ దగ్గర...నీ దగ్గర కాదు!

"పాపం! ఏదైనా కావలిస్తే గ్లాసులు వాయించడం గోడలకి చెప్పడం. నాతో మాటాడతారా?"

"పైవాళ్ళ దగ్గర ఆ మాత్రం నటించకపోతే నిన్నూ నన్నూ ఉండనిస్తారూ."

"సీతా—ఇలారా" అంటూ ఆమె చెయ్యి పట్టుకున్నాను. సీత వదిలించుకొని గదిలోకి పారిపోయింది! మూర్తి కూడా వెనకాలే వెళ్ళి ఆమె వల్లె వాటుని పట్టుకున్నాడు. సీత ఆగిపోయింది.

"బావుంది! ఎవరైనా చూస్తే బావుండదు వదలండి"

"ఫరవాలేదు. ఎవరూ చూడరులే అందరికీ ఇదే వ్యాపకమా ఏమిటి?"

"వద్దండి. అత్తగారు వస్తారు. నాకు భయంగావుంది. వద్దంటి"

"భయం దేనికో! రద్దూ!" అని ఆమెని తనవైపు లాగుకున్నాడు. సీత విడిపించుకోలేకపోయింది. తన బుగ్గలు మూర్తి గడ్డానికి తగిలి కిత కితలు పెట్టేయి. ఇంతలో అక్కి అలికిడి విని సీత గబగబా వంటింటిలోకి వెళ్ళిపోయింది. మూర్తి టేబిల్ ముందు కూర్చుని ఏదో రాసేస్తున్నాడు.

* * * *

"ఒసే! వేగిరం కాఫీ పెట్టు తొందర పని ఉంది" అన్నాడు మూర్తి తను కొన్న కొత్తచీర సీతకి అందిస్తూ.

"మరి లేవాలా! ఇప్పుడు చెప్పేరో లేదో అంత తొందరైతే ఎలా! అని చీరను చూస్తూ నవ్వుతూ అంది.

"నువ్వెప్పుడూ ఇంతే. నువ్వూ నీవేళాకోళం చాలు గాని వేగిరం కానీ" అన్నాడు పంచకట్టుకుంటూ.

"తలవగానే తాత పెళ్ళంటే ఎలా? లేచి పొయ్యి అంటించాలా! నేనేం ఆడుకుంటున్నానా? చెప్పగానే చేస్తూంటే మీ కలాగే ఉంటుంది. ఆ వెంకటమ్మలాంటి పెళ్ళాం దొరికింది కాదు, కుదురును!"

"కానీ, అలాగే కానీ నువ్వూ నేర్చుకో—అప్పుడు దాని మొగుడు చేసినట్టే నీకూను"

"అబ్బో! అయితే వదిలేస్తారన్న మాట!"

"అలాగే చేస్తే—తప్పకుండాను. అదో మాటా?"

"అమ్మ నాయనో భయం వేస్తూందండీ!"

"ఇదిగో—ఇంతసేపూ ఉట్టినే మాటల్తో గడిపేసేవు. హాస్యానికి దానికి వేళాపాళా ఉండాలి."

"మీ రనడం కాదనడమూనా ఇదిగో కాఫీ"

"ఆఁ! దేవాంతకురాల్లా ఉన్నావే అప్పుడే చేసే ఉంచావూ?"

"మీరు ఆజ్ఞ యివ్వాలిగాని ఎంత సేపూ?"

* * * *

"ఛీ ఛీ ఎప్పుడూ వెధవ వంకాయకూరే ఎన్నిసార్లు చెప్పేను. వేరే ఏదైనా చెయ్యమని! నీ మొహానికి మరేదీ చేత కానట్టుంది."

"మీరేమీ తేందే ఏం వండేదీ?"

"తేలేదు! ఇదోసాకు బాగా దొరికింది—వాజి మొహం నువ్వూను పో అవతలకి!"

"అదేమిటండీ ఈపాటి దానికే అంత కోపం? నేనేం చేసానని"

"ఏంచేశావో చాలదూ! ఏదో యింత వండి పారేద్దామనే చూస్తావు గాని నా సంగతి నువ్వెందుకు చూస్తావూ?"

"బావుందండీ! మీకు పెట్టడం మానేసి నేనేం పిండివంటలుచేసుకు తింటున్నానా? ఎందుకలా అంటారు?

"అదొక్కటి వుండిపోయింది. అలాగే చేసుకుతిను! తింటున్నావో లేదో ఎవరు చూసి ఏడిచారు?"

"పోనీలెండి అలాగే చేసుకు తింటాను. ప్రతిదానికీ తిట్టడం ఎందుకనీ?" అని సీత ఏడవడం మొదలు పెట్టింది.

"అదుగో...ఏమైనా అంటే ఏడుపు మొదలెడతావు-ఏడుపు మొహం నువ్వూను. నారాతే అంత! ఆఫీసుకెళితే అక్కడగోల అబ్బబ్బ! ఏ నూతులోనో గోతులోనో పడి ఛస్తే నయం—వెధవ ముద్ద నోటిలో కెలా వెళుతుంది! ఉప్పుంటే కారం వుండదు, కారం వుంటే ఉప్పు వుండదు" అని కంచం తోసేసి కోపంతో వెళ్ళిపోయేడు మూర్తి. సీత అదంతా చూసి వెక్కి వెక్కి ఏడ్చింది.

* * * *

"పాపాయికి పాల డబ్బా తెచ్చారా? రెండు రోజులయి పాలులేవు. నిన్న రాత్రి జ్వరం తలిగినట్టుంది" అని అడిగింది కళ్ళజోడు పెట్టి అందుకుంటూ.

"పాల డబ్బా! పాల డబ్బా! ఎక్కడ దొరకందే నేనెక్కడ నుండి తెచ్చేది. ఇంటి కొచ్చేసరికి చాలు పీక్కుతింటావు! వెధవ రోగాలూ మీరూను. ఒక్కరోజు బాగా ఉన్నారంటే రెండోరోజు తయారు ఈదురో మనుకుంటూ. డబ్బులేక చస్తూంటే ఈ డాక్టర్లకి-మందులకి ఎక్కడకని ఛావడం!"

"ఏదో ఓ నాడు చిన్న జ్వరంవస్తే రోజూ రోగాలే అంటారేం. పోనీండి మీకంత కష్టంగా వుంటే మానేయండి. ఇలాగే చచ్చిపోతాం. ఏం చేస్తాం!"

"మా గొప్ప వేదాంతం చెప్పావులే! ఛావండి ఎవరొద్దన్నారూ! పీడ వదిలిపోతుంది. అసలు నిన్ను కట్టుకోవడం నాది తప్పు. దాపరిం చేవు శనిలా."

"పోనీండి. మీకంత శనిలాగ కనపడితే ఆ పని మీరే చేసిపెట్టండి! హాయిగా వుందురుగాని."

"అబ్బో చెప్పేవే—ఏం అంత కొనితేవాలనుకున్నావా...ఛావు-ఎలావుంది? ఊరుకుంటే మితిమీరి పోతోంది."

"కొట్టండి-ఇంకా కొట్టండి—మీ కంత కష్టమయి పోయినాక నేను బ్రతికుండి ఏం లాభం."

మూర్తి కోపంతో లేచి వెళ్ళిపోయాడు.

* * * *

"అబ్బబ్బ! తల నొప్పితో చచ్చిపోతున్నా చూడవే—ఊఁ...ఊఁ నా కర్మ, మా అమ్మ ఉండే మాటుంటే యిలా అవునా...ఎంత పుణ్యం చేసుకుందో...ఇందాకటినుండి అరుస్తున్నా వినిపించుకోవు! నిన్ను ముట్టించా! నిన్నేం చేసినా పాపంలేదు" అంటూ మూర్తి మంచంమీద నుండి మూలుగుతూ జావ తేవడం కొంచెం ఆలస్యమయితే సీతని కసురుతున్నాడు. తెలుపు, నలుపు వెంట్రుకలతో గడ్డం పూర్తిగా మాసిపోయింది.

సీత వచ్చి జావ నెమ్మదిగా మూర్తికి పట్టింది.

"చాల్లే ఇంక పో. ఎక్కడికి పోతావో !"

"అయ్యో అంతలా మాటాడకండి. ఆయాసం వస్తుంది! నేనిక్కడే వుంటున్నాను. ఎక్కడికీ పోలేదు. కొంచెంసేపు పడుకోండి కాళ్ళు పడతాను."

"ఆఁ! చెప్పేవు నా సుఖం నువ్వు కోరేమాటుంటే ఇంతవరకూ రాకపోను ! తల నొప్పెడుతూంటే కాళ్ళు పడతానంటావు ! ఏదో ఏడుపు !"

"అలా అనకండి. తల కాళ్ళూ కూడా పడతాను. నాకేం కష్టమా !"

"ఊఁ...అబ్బ...కాని..."

సీత తలపడుతూ కూర్చుంటుంది. డాక్టరు ఇంతలో వచ్చేడు. ఏదో మందు ఇచ్చి రెండేసి గంటల కోసారి రెండురోజులపాటు పుచ్చుకోమని చెప్పి వెళ్ళిపోయాడు.

"అయితే ఇంక నే బ్రతికినట్టే-అన్నీ అలా కలిసొస్తాయి. పోసి ఛస్తేనే హాయిగా వుంటుంది."

"అయ్యో! అదేమిటండీ అలా అంటారు మీకేం—"

"నాకేం లేదు. దుక్కలా వున్నాను. రెండేసిగంటల కోసారి నువ్వు మందివ్వడం కూడానా. నీ మొహం, నిద్రపోయావంటే మొద్దులా ఇవతల చచ్చిపోతున్నా లేవవు. ఇంక నాగతింతే...అయ్యో భగవంతుడా..."

"అలా అనకండి. నేనెందుకిక్కడ వున్నాను. మందివ్వకుండా మిమ్మల్ని వదిలేస్తానా. నాకుమాత్రం అక్కరతేచూ. మీ మాటలు వింటూంటే నాకు దుఃఖం వస్తూంది. అస్తమానం ఎందుకలా తిడుతూంటారు? నేను చేసిన తప్పేమిటి? నామీద ఎందుకింత కోపం వచ్చిందో, ఏమండీ! నన్ను క్షమించరూ? నా వల్ల ఏదైనా తప్పుంటే చెప్పండి. నాకు మీరే అన్నీను. మీరు సుఖంగా వుంటే చాలని వేయిదేముళ్ళకి మొక్కుకున్నాను. నన్ను రక్షించండి" అని మూర్తి కాళ్ళమీద పడి ఏడ్చింది సీత.

"అమ్మ !...లేవే పోతులా పడితే మొయ్యగలనా. కాళ్ళు విరిగి పోయాయి! నీకున్న లక్షణమే అది. ఏమైనా అంటే కొంప మునిగిపోయినట్టు ఏడుస్తావు. దేముళ్ళకుకూడా మ్రొక్కుకోడం దేనికి దండుగ. చావనీ !"

"వద్దండి! నా ముందు అలా అనకండి. నాకు భయం వేస్తుంది!"

"అలాగేలే-ఇక్కణ్నుంచి పోమూ-మొర్రో మనుకుంటూ !"

* * * *

"ఏమండీ మందు తాగండి! ఒక్కసారి లేవండి?"

"ఇలా తే-యిప్పుడెంత అయింది."

"నాలుగవుతుందేమో !"

"నువ్వు పడుక్కోలేదూ ?"

"పడుక్కున్నానండీ. ఇప్పుడే లేచాను. ఏం అలా అడిగారు ?"

"ఏంలేదు. మందివ్వడానికి సమయానికి తెలివి ఎలా వస్తూందీ అని."

"........."

"పోయి పడుక్కో"

"మీరు మొదట పడుక్కోండి. నేను పోయి పడుక్కుంటా." అని ఆ పక్కనే కూర్చుంది! మూర్తికి లోతుగా కళ్ళుపోయి నీరసంగా ఉన్నట్టు కనిపించిన సీతని చూసేక జాలి కలిగింది. "నువ్వెళ్ళి పడుక్కుంటేనేగాని నేను పడుక్కోన"ని చెప్పేడు. సీతకి ఇతను యింత శాంతంగా మాటాడ్డం వింతగా తోచింది. ఇంకా ఏమైనా అంటే ఏమంటాడో 'అని అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

మూర్తికి మరి నిద్ర పట్టిందికాదు. "సీత నిద్రపోతే ప్రతి రెండు గంటలకీ లేచి మందు ఎలా ఇవ్వగలుగుతూంది? లేదు. సీత నిద్రపోలేదు! తన కోసం ఎంత కష్టపడుతూంది. ఎంత నీరసంగా అయిపోయింది!" ఇలా ఆలోచించుకుంటూ పక్కకు తిరిగి చూశాడు. సీత లోపల పొయ్యి విసురుతూంది.

"సీతా..."

"ఏమండీ—వస్తున్నా..."

"ఇంకా పడుక్కోక ఏం చేస్తున్నావు?"

"పడుకున్నానండీ"

"అబద్ధం ఆడుతున్నావు కదూ! పోనీ"

"లేదండీ కాఫీ చేస్తున్నా!"

"ఎందుకూ ?"

"మీకే..."

"నా కెందుకిప్పుడు? యిందాకా జావ తాగేను కదూ ?"

"ఏంతాగారో ఏమో. చేసిందంతా అలానే వుండిపోయింది. కాఫీ అయినా తాగకపోతే నీరసం చేస్తుంది."

"వెర్రిదానా పడుక్కో !"

"అలాగే లెండి—"

"వెళ్ళు..."

*   *   *   *

మర్నాడు మూర్తి జాగ్రత్తగా సీత ఏం చేస్తూందో చూస్తున్నాడు. ఆ ఆలోచనలో తనకి బాధ అంతగా కనుపించలేదు! పదకొండు అయినా సీత పండుకున్నట్టు కనపడలేదు! ఒంటిగంట! రెండు! అయింది. అయినా సీత అలాగే మందు యిస్తున్నట్టో, జావ చేస్తున్నట్టో కాళ్ళు పడుతున్నట్టో గడిపేసింది. యిదంతా మూర్తి చూసి కళ్ళంట బొటబొట నీరు కార్చాడు.

"అదేమండీ కళ్ళంట నీళ్ళు వస్తున్నాయి. తల బాధగా వుందా?" అంటూ చీరకొంగుతో కంటినీరు తుడుస్తూంది.

"నువ్వే నన్ను ఏడిపిస్తున్నావు!" ఈ మాట వినేసరికి సీత గుండె దడదడా కొట్టుకుంది, ఏమి మాటాడలేకపోయింది.

"నువ్వు అన్నం తినలేదు కదూ?"

"తిన్నానండి!"

"ఎప్పుడు తిన్నావు? మంచంమీద వుండే చూడలేదనుకున్నావా? చెప్పు తినలేదా?"

"........."

"ఇలా ఎన్నాళ్ళనుండి అన్నం తినలేదు?"

"అయ్యో! రోజూ చక్కా తింటున్నానండి. ఈ రోజే మానేశాను—ఆకలిలేదు."

"బావుంది."

"పోనీలెండి... ఈ జావ తాగండి."

"ఇప్పుడొద్దు...నా కాకలిలేదు."

"అదేమిటండీ! ఏం తిన్నారు గనుక ఆకలి లేకపోవడానికి?"

"నువ్వేం తిన్నావు గనుక నీకీ వేళ ఆకలి లేకపోవడానికి."

"అదా! నా సంగతికేం లెండి మీరు తీసుకోండి!"

"అక్కరలేదు. నాకింక కాఫీ కూడా అవసరంలేదు!"

"అయ్యో! ఏం చేసినా మీతో చిక్కే. నేవందుకొని తింటాలెండి—మీరు తీసుకోండి!"

"అయితే ముందర పొయ్యి అంటించి అన్నం వండుకో అప్పుడు తీసుకుంటాను!"

తన భర్తలో ఇంత మార్పు వచ్చినందుకు సీత ఆనందం పట్టలేక పోయింది.

* * * *

"ఏమండీ పండక్కి పెద్దపిల్ల ఎలాగూ రాదు. రెండోదాన్నైనా, ఆయనికి వుత్తరం వ్రాసి తీసుకు రమ్మనమనండి—అల్లుడు కూడా వస్తాడు. సరదాగా వుంటుంది! మనమరాలిని చూసి ఏడాదయింది. చూడాలని వుంది!" అంది సీత దంపిన వక్కపొడి భగద్గీత చదువుకుంటూన్న మూర్తి చేతికందిస్తూ—

"అలాగనే రాసేను ఉత్తరం. పంపిస్తాడో పంపించడో. నాకు మాత్రం చూడాలని లేదూ?"

"పెద్దల్లుడికి కూడా మరోసారి వ్రాసి చూడండి ఏమంటాడో!"

"ఎన్నిసార్లు రాయడం! అలాగే మరోసారి రాసి చూస్తాను!"

"అన్నట్టు అబ్బాయి దగ్గరనుండి ఏమైనా ఉత్తరం వచ్చిందా?"

"మంగళ వారం నాడు వస్తాడట. కోడల్నీ పిల్లల్నీ కూడా తీసుకు వస్తానని వ్రాసేడు."

"అమ్మ నాయనా! ఇప్పటికి వాడి తిక్క తిరిగినట్టుంది. ఎప్పుడూ ఇదిగో అదిగో అంటూ గడిపేశాడు!"

"అవును దూరాభారం...సంసారాన్నంతటినీ తీసుకు వచ్చేసరికి మాటలా ఏమిటి?"

"చిన్నల్లుడికి ఈ సారయినా వాచీ పెట్టకపోతే ఒప్పుకోడు!"

"ఏం ఇప్పుడు తెలిసిందా అల్లుడంటే ఏమిటో? వాచీ వరకూ ఎందుకూ? సూటు పెట్టమంటే పెట్టేడూ మీ నాన్న? అలాగే వుంటుంది. తల నొప్పైనా తనదాకా వస్తేనే గాని తెలీదు!"

"చాలండీ! మీ ఎత్తిపొడుపులూ మీరూ. చూస్తున్నాగా మీరేం పెట్టేస్తున్నారో అల్లుళ్ళకి. రెండేళ్ళయి చిన్నల్లుడికి వాచీ కొనిపెట్టింటే అంటే డబ్బు లేదులేదని గడిపేశారే మా నాన్నకి మాత్రం ఎలా వస్తుంది?"

"పెడతాను! మానేస్తాననుకున్నావా ఏమిటి? మీ నాన్నలాగ!"

"చాలండోయ్! ఈ గొప్పలు...మీరంటే ఏమిటి!...ఈ సందడిలో భగవద్గీత మరిచిపోయారూ!"

"అవునవును! ఇప్పుడు భగవద్గీత చదువుకో మనకపోతే మరేమిటంటావు!"

"ఛీ...పోదురూ!"